# మోహన రాగం

## అడల్ట్స్ ఓన్లీ కథ!

**కె.కె.భాగ్యశ్రీ**

''ట్రింగ్'' మన్న కాలింగ్‌బెల్ చప్పుడుకి పిల్లలిద్దరి మధ్య పడుకున్న మోహనకి మెలకువ వచ్చింది. కాళ్ళు చేతులు తనమీద వేసి పడుకున్న రోహిత్, రమ్యలను సరిగా పడుకోబెట్టి, ఇద్దరికీ దుప్పటి కప్పి, మంచం దిగి తలుపు తీయడానికి వెళ్ళింది మోహన.

ఈలోపే మరో రెండుసార్లు బెల్ మ్రోగింది.

''ఏమిటెంత ఆలస్యం? ఎంతసేపైంది నేను బెల్ కొడుతూ?'' అసహనంగా అడిగాడు శ్రీకాంత్ తలుపు తీసిన మోహనను చూసి.

బదులివ్వలేదామె.

''త్వరగా భోజనం వడ్డించు...ఆకలి దంచేస్తోంది'' అంటూ బాత్‌రూం వైపు నడిచాడు.

అతనొచ్చేసరికి టేబుల్ మీద ప్లేట్ పెట్టి పదార్థాలను వడ్డించింది మోహన.

పొగలు కక్కుతున్న వేడి వేడి వంటకాలను చూసిన శ్రీకాంత్‌కి క్షుద్బాధ ద్విగుణీకృతమైంది.

అతను భోజనం చేస్తుంటే ఎదురుగా కుర్చీలో కూర్చుంది మోహన.

భోజనం చేస్తున్న వాడల్లా సడెన్‌గా ఆగి ''పిల్లలు అప్పుడే పడుకున్నారా? ఏమిటో? ఈమధ్య తొందరగా నిద్రపోతున్నారు'' అన్నాడు శ్రీకాంత్.

మోహన చిన్నగా ఆవులిస్తూ ''వాళ్ళు త్వరగా పడుకోవడంలేదు. మీరే ఆలస్యం ఇంటికొస్తున్నారు. రమ్య ఇప్పటివరకూ మీకోసం ఎదురుచూసి, ఎదురుచూసి నిద్రపోయింది. ఏంటోగానీ తమరి షికార్లీమధ్యన మరీ ఎక్కువైనాయి'' నిష్ఠూరంగా అంది మోహన.

అప్పటికే నిద్రాదేవత ఆమె కనురెప్పలపై అధిష్టించింది.

తెలుపు మీద చిన్న ప్రింట్ ఉన్న వాయిల్ చీర, జాకెట్‌తో తలంటుకున్న కురులులోంచి మెడమీదుగా తొంగిచూస్తున్న విరజాజిదండతో మోహన ముగ్ధ మనోహరంగా ఉంది.

నిద్రాభారంతో అరమోడ్పులైన ఆమె విశాలనయనాలు, శృంగార సమావేశానికి రారమ్మని పిలుపునిస్తున్న ఆహ్వానపత్రికల్లా ఉన్నాయి.

ఆమెనలా చూస్తున్న శ్రీకాంత్‌లో కోరికలు, మబ్బులను చూసి పురివిప్పి నర్తించే మయూరమల్లే ఉప్పొంగిపోయాయి.


భోజనం ముగించి పిల్లలు పడుకున్న చోటికి వెళ్ళాడు. అమాయకంగా నిద్రిస్తున్న రమ్య, రోహిత్‌లను ప్రేమగా ముద్దాడాడు శ్రీకాంత్.

నిద్రలోనే కలవరిస్తోంది రమ్య-

''నాన్నగారూ...మా ఫ్రెండ్స్ అందరూ ఎగ్జిబిషన్ చూసేశారు...మరినన్నెప్పుడు తీసుకెళ్తారు? జైంట్‌వీల్ ఎప్పుడెక్కిస్తారు?''

ఆ మాటలకి చలించిపోయాడు శ్రీకాంత్.

''రోజూ అనుకుంటూనే ఉంటాడు తొందరగా ఇంటికి చేరాలని...కాని ఫ్రెండ్స్‌తో బాతాఖానీకి దిగితే అస్సలు కాలమే తెలియదు'' మరోసారి రమ్యను ముద్దు పెట్టుకుని హాల్లోకి నడిచాడు.



టీవీ ఆన్‌చేశాడు. ఏదో 'అరవ' డబ్బింగ్ సీరియల్ వస్తోంది. విసుగ్గా టీవీ ఆఫ్ చేశాడు.

తమగదిలోకి వచ్చి చూసేసరికి ఖాళీ బెడ్ వెక్కిరించిందతన్ని. ''మోహన ఏమైనట్లు? ఇంకా వంటిల్లు సర్దుకోవడం పూర్తికాలేదా?'' అనుకుంటూ పిల్లల గదిలోకి వచ్చిన అతనికి ఆశ్చర్యం కలిగింది.

అక్కడ పిల్లల ప్రక్కన పడుకుని గాఢనిద్రలో మునిగి ఉంది మోహన. ముడుచుకుని పడుకున్న ఆమె ముద్దగా కట్టిన మల్లెచెండులా ముద్దుగా ఉంది. బెడ్‌లైట్ కాంతిలో ఆమె వదనం పచ్చని చేమంతిలా ఉంది.

పాదాలమీద నుండి చీరకొద్దిగా మీదకు జరగడంతో పండు తమలపాకుల్లాంటి సుతిమెత్తని చరణాలు వెండి మువ్వల పట్టీలతో మెరిసిపోతున్నాయి. అరిపాదంలో పెట్టుకున్న గోరింట ఎర్రగా పండి, పాదానికే ఒకింత అందం తెచ్చింది.

పైట ప్రక్కకి తొలగి, పలుచని ఉదరభాగం బంగారుమైదానంలా భాసిస్తోంది. నడుంఒంపు మలుపుతిరిగిన

నదీపాయలా, ఎత్తైన వక్షం హిమవన్నగంలా... నుదుటిమీద అల్లిబిల్లిగా పరుచుకున్న ముంగురులు నీలిమేఘాల్లా, మెడక్రింది నునుపు పాలరాతి మెరుపులా... ప్రకృతిలో ఒక్కోచోట ఒక్కో అందం ఉన్నట్లు మోహనలో ఒక్కో అవయువం, ఒక్కో రకమైన సౌందర్యంతో అలరారుతున్నాయి.

'పెళ్ళయిన దగ్గర్నుండి ఇప్పటివరకూ మోహనలో చెప్పుకోదగిన మార్పేమీ లేదు. కొద్దిగా ఒళ్ళు చేయడం మినహా...' అనుకున్నాడు శ్రీకాంత్.

ఆ భంగిమలో మోహనను చూసిన శ్రీకాంత్, ఆపుకోలేని తమకంతో మోహనను చిన్నగా కుదిపాడు.

ఉహూ... ఆమెలో ఏ కదిలిక లేదు.

అరిపాదంలో గోటితో ముగ్గులు వేశాడు. చిన్నగా కదిలింది మోహన. కళ్ళు తెరిచి చూసింది మెల్లగా. కోరిక నిండిన కళ్లతో తననే చూస్తున్న శ్రీకాంత్ కనబడ్డాడు ఎదురుగా.

''ఏంటి మోహనా! ఇక్కడ పడుకున్నావు?'' చేయిపట్టుకుని గుంజాడు.

కళ్ళల్లో ఏ భావమూ కనబడనీయక ''నాకు నిద్రొస్తోంది...'' నిరాసక్తంగా అంది మోహన.

''నిద్రగిద్ర అన్నీ ఎగిరిపోతాయి. మురిపించుకోక తొందరగా రావోయ్...'' ఎర్రని ఆమె పెదవుల మీద చూపుడువ్రేలితో రాస్తూ అన్నాడు శ్రీకాంత్.

''చెప్తుంటే మీక్కాదూ! మళ్లీ ప్రొద్దున్నే లేచి బండెడు చాకిరీ చేయాలి. నన్నొదిలేయండి మహాప్రభు...'' చేతులు జోడిస్తూ విసురుగా అంది మోహన.

పాలపొంగు మీద నీళ్ళు జల్లినట్టు, శ్రీకాంత్‌లో ఉవ్వెత్తున ఎగిసిపడిన మోహజ్వాల చప్పున చల్లారిపోయింది ఆమె మాటల్తో.

'ఔరా! మూడ్ అవుట్ చేయడంలో ఈ ఆడవారికి సాటి వేరెవరూ లేరు..' అనుకున్నాడు నిరుత్సాహంగా.

'అయినా ఎందుకోగాని మోహన ఈమధ్య మరీ డల్‌గా తయారైంది. దాదాపు రోజూ ఇదే సిట్యుయేషన్ ఎదురవుతోంది. మోహనలో ఎందుకిలాంటి మార్పు కలిగిందో తనకు అనూహ్యంగా ఉంది. తనకు కావాల్సిన అన్ని పనులూ చేసి పెడుతుంది 'కార్యేషుదాసిలా'.. కాన్వెంట్ ఫీజు కట్టడం నుండి...కరెంట్ బిల్ పే చేయడం దాకా సమస్త కార్యాలూ చక్కబెడుతుంది 'కరణేషు మంత్రి'లా.

'భోజ్యేషుమాత'లా కడుపు చూసి అన్నం పెడుతుంది.

కాని...కాని...పడక దగ్గరకొచ్చేసరికి మాత్రం కసురుకుని, విసిరికొడుతోంది. తన పాలిట 'శయనేషురంభ' కాలేకపోతోంది. ఎందుకు? ఎందుకీ జడత్వం చోటుచేసుకుంటోంది ఆమెలో'

ఆలోచనలన్నీ మూకుమ్మడి దాడి ప్రకటించాయి శ్రీకాంత్‌మీద.

కాంక్షాపూరిత మనశ్శరీరాలను అదుపులో పెట్టుకోవడానికి విఫలయత్నం చేస్తూనే ఉన్నాడు ఆ రాత్రంతా.



★ ★ ★

ప్రొద్దున్నే టిఫిన్ తింటూ ''నీ పద్ధతి నాకేం నచ్చలేదు'' అన్నాడు శ్రీకాంత్.

''నేనూ అదే చెప్పాలనుకుంటున్నాను'' నాకు కూడా మీ ప్రవర్తన అస్సలు నచ్చడం లేదు. రోజూ రాత్రి పదయితే గాని ఇల్లు చేరడం లేదు. నన్ను, పిల్లల్నీ అసలు పట్టించుకోవడం లేదు..'' అంది మోహన కాస్త కినుకగా.

''ఓహో! నువ్వా రూట్లో వచ్చావా! మగాడిని...నాకు సవాలక్ష పనులుంటాయి. నేనేం అర్ధరాత్రి దాకా త్రాగో, లేక అడ్డమైన చోట్లా తిరిగో ఇంటికి రావడం లేదు...జస్ట్ కాస్సేపు అలా గడిపి ఇంటికొస్తున్నానంతే...'' రోషంగా చెప్పాడు శ్రీకాంత్.

''గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు, తొందరగా ఇంటికిరావడం లేదని నేనంటే మీకెందుకో అంత ఉలుకు! నేనడిగింది మణులా..మాన్యాలా...నన్ను, పిల్లల్ని నిర్లక్ష్యం చేయవద్దని వేడుకుంటున్నానంతే..''

ఈసారి గద్గదమైంది మోహన స్వరం.

అదేమీ గమనించనట్లుగా ''ఇరవై నాల్గుగంటలూ నీ ముందే కూర్చోవాలంటే నాక్కుదరదు. నీ కొంగు పుచ్చుకుని, నీ వెనకాలే తిరగడం నాకు చేతకాదు'' కరుగ్గా అని బయటకు వెళ్లిపోయాడు శ్రీకాంత్.

మోహన సుందరనయనాల నిండా నీళ్ళూరాయి. ''ఈయన ఈ జన్మకి మరి మారరు'' అనుకుంది బాధగా.

'ఛీ...ఛీ...మోహనేంటి ఇంతలా మారిపోయింది. తమ పెళ్ళయిన ఈ పన్నెండేళ్లలోనూ మోహన ఎప్పుడూ ఇలా ప్రవర్తించలేదు....' అనుకున్నాడు శ్రీకాంత్ కూడా అదే సమయంలో.

శ్రీకాంత్‌కి, మోహనకి పెళ్ళయ్యేసరికి మోహన వయసు సరిగ్గా పదహారు. వారిద్దరికీ దూరపు చుట్టరికం ఏదో ఉంది. మోహన వయసు తెలియగానే శ్రీకాంత్ వెనుకంజ వేశాడు.

అతనికి, ఆమెకి మధ్యన ఎనిమిదేళ్ళ అంతరం ఉండడమే అతని సంశయానికి కారణం.

మోహన సత్సంప్రదాయానికి చెందిన కుటుంబంలోంచి వచ్చిన పిల్లని, మంచి మర్యాద తెలిసిన అమ్మాయని శ్రీకాంత్ కుటుంబసభ్యులంతా నచ్చచెప్పారు.

చేసేదిలేక వాళ్లతో పెళ్ళిచూపులకి వెళ్లాడు శ్రీకాంత్.

## ఎవర్‌గ్రీన్ హీరోయిన్

**రమ్యకృష్ణ పేరు వినగానే ఆమె అందమైన రూపం కళ్లముందు కదలాడుతుంది. తెలుగు ప్రేక్షకులకి ఆమెని ప్రత్యేకంగా పరిచయం చెయ్యనక్కర్లేదు. నరసింహ, ఆహ్వానం, పంచతంత్రంలో ఆమె నటన అందరి ప్రశంసలూ అందుకుంది. సినిమా పరిశ్రమకొచ్చి 18ఏళ్ళు అయినా ఆమె అందంలో ఎలాంటి మార్పూ కనిపించదు. మొన్నామధ్య కొంచెం బొద్దుగా తయారైనా పంచతంత్రం కోసం ఆమె తెగ కష్టపడి లావు తగ్గి స్మార్ట్‌గా మారిపోయింది. 'నేనెన్ని సినిమాల్లో నటించినా ప్రేక్షకులకి బోర్ కొట్టదు. నా గ్లామర్ అలాంటిది. మొదటిసారిగి ముత్యాల సుబ్బయ్య దర్శకత్వం వహిస్తున్న ఓ కన్నడ చిత్రంలో ఆమె నటిస్తోంది.**

అయితే తొలిచూపులోనే మోహనపై మనసు పారేసుకున్నాడు శ్రీకాంత్. పాలలో పచ్చిపసుపు, కాస్త కుంకుమపువ్వు రంగరించి పోతపోసినట్లుగా ఉన్న ఆమె దేహచ్ఛాయ, కలువరేకుల్లాంటి కన్నులు, పగడపు రంగులో వణికే చిగురుటధరాలు, అపరంజి బొమ్మలా అన్ని సోయగాలతో మెరిసిపోతున్న మోహన అతని ఆమోదం మేరకు అతని అర్ధాంగి అయ్యింది.

పెద్దలందరి సలహాలు, సూచనల మేరకు అతనికి అనుగుణంగా నడుచుకుని అతన్ని అలరించింది. అంతులేని సుఖ, పారవశ్యాలని కలుగజేసింది. 'ఆమెనెందుకు పెళ్ళిచేసుకున్నానా' అని విచారించవలసిన పరిస్థితి గానీ, అగత్యం కానీ అతనికి కలుగలేదు.

ఇద్దరు పిల్లలు పుట్టారు. మోహన తల్లిదండ్రులు పోయారు. దగ్గరవారందరూ దూరమైనారు. మోహనకి శ్రీకాంత్, పిల్లలే సర్వస్వమయ్యారు. ఏనాడూ అతనికి ఎదురుచెప్పి ఎరుగని మోహన ఇప్పుడు... ఇలా... దాంపత్యజీవితం పట్ల విముఖత, విరక్తి పెంచుకుంటుందో అతనికి అంతుచిక్కలేదు.

★ ★ ★

''ఏంటిరా శ్రీకాంత్! అలా పరధాన్యంగా ఉన్నారు?'' అడిగాడు సుందర్.

అతడు శ్రీకాంత్‌కి ఆప్తమిత్రుడు... ఆంతరంగికుడు. అప్పటికి రెండుసార్లు పిలిచాడు శ్రీకాంత్‌ని. అయినా ఉలకక, పలకక ఏదో లోకంలో ఉన్నట్లు ఉన్న శ్రీకాంత్‌ని చూసి ఆశ్చర్యపోయాడు సుందర్.

ఒక్కసారిగా ఉలిక్కిపడుతూ ''ఏంలేదురా? ఏమీలేదు..'' తడబడుతూ అన్నాడు శ్రీకాంత్.

''ఏంలేకపోవడమేంటి? ఏదో.. ఏదో ఉంది నీ మనసులో...'' రాగం తీశాడు సుందర్.

''ఏం లేదురా! ఈ మధ్యన మోహన అదోకరకంగా తయారైంది... విసుగు, కోపం ఎక్కువైనాయి. ఏవేవో ఊహించుకుని నన్ను ఇబ్బంది పెడుతోంది..'' విచారంగా చెప్పాడు శ్రీకాంత్.

''అయితే నువ్వు సీరియస్‌గానే చెప్తున్నావన్న మాట. అసలేమైందిరా''

ఈమధ్యకాలంలో మోహన తన పట్ల ప్రవర్తిస్తున్న తీరు గురించి, ముఖ్యంగా ఏకాంతంలో, ఏవిధమైన తపన లేకుండా నిరాసక్తత కనబరుస్తున్న ఆమె వింతవైఖరి గురించి సుందర్‌తో మొరపెట్టుకున్నాడు శ్రీకాంత్.

తనని బాధిస్తున్న సమస్యను స్నేహితుడితో చర్చించాక శ్రీకాంత్ హృదయం కాస్త తెరిపినపడింది.

సంగతి విన్న సుందర్ దీర్ఘాలోచనలో పడ్డాడు.

''పోనీ... నీ ప్రవర్తనలో ఏమైనా తేడా ఉందేమో గమనించావా?''

''ఆనాటినుండి ఈనాటి వరకూ నా అలవాట్లలో ఎటువంటి మార్పులేదు. నా పెళ్ళికాకముందునుండి ఇప్పటివరకూ నాకున్న ఏకైక అలవాటల్లా ఆఫీస్ అయ్యాక రాత్రి తొమ్మిదింటి వరకూ నా ఫ్రెండ్స్‌తో కాసేపు కబుర్లతో గడిపి ఇల్లు చేరడం...'' కాస్త గర్వంగా చెప్పాడు శ్రీకాంత్.

''దటీజ్ ది పాయింట్... లోపం అంతా నీ దగ్గరుంచుకుని.. మా చెల్లెమ్మనాడిపోసుకుంటావెందుకు? నీ వలన ఆమెకి ఏదో విధమైన లోటు జరుగుతోందన్నమాట.. ఏదో తెలియని వెలితి ఆమె జీవితంలో చోటుచేసుకుంది..'' విషయాన్ని కనుగొన్నట్లుగా జేమ్స్‌బాండ్‌లా పోజిచ్చాడు సుందర్.

''వ్వాట్... లోపమా.. నాలోనా? అయినా మోహనకి నేనే విషయంలోనూ లోటు కలగజేయడం లేదే. ఇంటి అవసరాలకు ఖర్చుపెట్టుకోవడానికి గాను నా జీతమంతా ఆమె చేతికే ఇస్తాను. కావలసినవేం కొనుక్కున్నా కాదనను. ఎక్కడికెళ్లాలన్నా అడ్డుచెప్పను..'' చెప్పాడు శ్రీకాంత్ ఆశ్చర్యపోతూ.

చిన్నగా నవ్వి అతడి భుజం మీద స్నేహపూర్వకంగా తట్టాడు సుందర్.

''నువ్వనేకాదు... చాలామంది మగాళ్ళు భార్యకి అన్నీ సుఖాలు అమర్చిపెడుతున్నామని, కావలసినంత స్వేచ్ఛను ఇచ్చామని.... ఆమేం చేసినా కాదనమని తమను తామే తెగపొగుడుకుంటూ ఉంటారు. నిజానికి వారికి కావలసినవి ఇవేమీ కాదు. భర్త ప్రేమాదరణలు, ఆప్యాయాతనురాగాలు. చిన్నవయసులోనే వివాహమైనా, నీ మనసెరిగి, నీకనుగుణంగా మసలుకుని నీకలలు, కోరికలు పండించిన ఇల్లాలు, ఇప్పుడిలా తయారైందంటే దానికి కారణం నువ్వే..'' అన్నాడు సిగరెట్ తీసి లైటర్‌తో వెలిగించుకుంటూ.

అతని మాటలను అంగీకరించనట్లుగా తల అడ్డంగా ఊపి ''మోహనతో పెళ్ళయ్యేనాటికే నాకీ స్నేహాలు ఉన్నాయి. అప్పట్లో మోహన పెద్దగా పట్టించుకోలేదు. నాకేవిధమైన ఆంక్షలు విధించలేదు. మరి నా అలవాట్లు ఆమెని ఇప్పుడెందుకు బాధిస్తున్నాయో నాకు బోధపడలేదు'' సందేహాన్ని వెలిబుచ్చాడు శ్రీకాంత్.

మళ్లీ నవ్వాడు సుందర్. అమాయకంగా అడుగుతున్న శ్రీకాంత్ చేసిన తప్పు చెబితే గాని తెలుసుకోలేని పసివాడిలా కనిపించాడతనికి.

''నువ్వన్నదీ పాయింటే! కాదనలేదు. కాని మోహన అప్పటికి లోకజ్ఞానం ఎరుగని చిన్నపిల్ల. పెద్దలు నీ పట్ల ఎలా నడుచుకొమ్మని చెప్పారో, అలాగే నడుచుకోవడం తప్ప మరొకటి తెలీదు. అప్పటికి ఆమె మనసు వికసించని పుష్పంలాంటిది. ఆ తరువాత పురుళ్ళు, పుణ్యాలు, పిల్లల ఆలనాపాలన... అప్పుడప్పుడు పుట్టింటికి రాకపోకలు.. ఇటువంటి జీవనవిధానంలో మోహన తన గురించి తాను ఆలోచించుకునే తీరిక గానీ, ఓపిక గానీ ఉండేది కాదని నా అభిప్రాయం.

మంత్రముగ్ధుడై వింటున్నాడు శ్రీకాంత్. సుందర్ మాటలతనిలో ఉద్భవించిన శంకలన్నింటినీ తరిమికొడుతున్నాయి.

''కాలంతోపాటు ఆమెలో ఇంగితజ్ఞానం, ఊహాశక్తి పెరిగాయి. కన్నవారుపోయారు. అయినవారు దూరమయ్యారు. పిల్లలూ పెద్దవయ్యారు. ఇదివరకంటే ఆమె పుట్టింటికి వెళ్లిరావడం వలన మానసికంగా రిలీఫ్‌ని పొందుతూ ఉండేది.. కాని ఇప్పుడదేమీ లేదు. ఆమె పూర్తిగా నీకు, నీ పిల్లలకి



సేవలు చేయడానికి అంకితమైంది. ఆమె జీవితంలో యాంత్రికత చోటుచేసుకుంది. పగలంతా ఇంట్లో పనితో అలసిపోయిన ఆమె నీనుండి చిన్న ఓదార్పును, కొద్దిపాటి లాలన కోరుకుంటోంది.

రోజుల్లా ఆమె అనుభవించిన ఏకాకితనాన్ని నీ సమక్షంలో పారద్రోలాలని భావిస్తోంది. ఆమె ఒంటరితనం వలన అనుభవించిన క్షోభను అర్థం చేసుకుని నువ్వు, రాత్రిపూట ఆమెను దగ్గరకు తీసుకుంటేనే ఆమె మీద నీకు ప్రేమలేదని, కేవలం ఆమె శరీరంపై వాంఛమాత్రమే ఉందని ఆమె ఫీలవుతూ ఉందేమో! అందుకే నువ్వు దరిచేరగానే విసిరికొడుతోంది.

''స్త్రీని శృంగారానికి సిద్ధం చేయాలంటే ఆమె శరీరాన్ని స్పృశిస్తే చాలని అనుకుంటారు నీలాంటి వారు. కాని ఆమెను ఉత్తేజపరచాలంటే శరీరాన్ని మాత్రమే కాదు..మనస్సుని కూడా మీటి శృతి చేయాలని తెలుసుకోరు.''

ఆమెతో కొద్ది సమయం గడుపుతూ ఆమె కష్ట సుఖాలను ఆసక్తిగా అడిగి తెలుసుకుంటూ ఉంటే భర్త తన గురించి శ్రద్ధ తీసుకుంటున్నాడనీ, తనంటే పంచప్రాణాలనీ అర్థం చేసుకుని పొంగిపోతుంది. మగడిపై ఆమెకు గల వలపు రెట్టింపవుతుంది. తృప్తితో మనసునిండిన ఆమె రసానుభూతులు పంచి ఇస్తూ, మగని మరిపిస్తుంది.

ఒకప్రవాహ వేగంతో చెప్పుకుపోతున్నాడు సుందర్. నిపుణుడైన మనస్తత్వ శాస్త్రవేత్తలా మోహన ప్రవర్తనను విశ్లేషిస్తున్నాడు. అతని మాటలు చెవుల్లో అమృతం పోసినట్లుగా ఉన్నాయి తప్ప వెగటు అనిపించలేదు శ్రీకాంత్‌కి.

తిరిగి చెప్పడం మొదలుపెట్టాడు సుందర్.

''రసమయ జీవితానికి, అనురాగపూరిత దాంపత్యానికి కావలసిన ముడిసరకులు ఒక లాలన, ఒక ఓదార్పు, చిన్న మెచ్చుకోలు..తీయని ప్రశంస...కమ్మని పలకరింత...ఇవే జీవితాన్ని సుఖమయం చేసే చిట్టి చిట్కాలు.

నువ్వే ఆలోచించు..బయట ఫ్రెండ్స్‌తో గడపడానికి, మిగతా కార్యక్రమాలకి మనం వెచ్చించే సమయంలో కనీసం ఒక్క అరగంట సేపైనా మన అర్ధాంగితో గడపడానికి కేటాయిస్తే ఎంత బాగుంటుందో...ఆమె సంతోషంతో పరవశించిపోతుంది. ఆమె అందంలో గాని, ప్రవర్తనలోగాని నచ్చే అంశాలను అప్పుడప్పుడు ఆమె ముందు మెచ్చుకోవాలి. దానివలన నువ్వు ఆమెని అమితంగా ఇష్టపడుతున్నావని ఆమె గ్రహిస్తుంది.

ఇవన్నీ నీకు తెలియనివి కాదు...ఒక్కోసారి మనకు తెలిసిన విషయాలే అయినా నిర్లక్ష్యం చేస్తూంటాం...నువ్వు చెప్పింది విన్నాక నీ జీవితం ఎందుకంత నిస్సారంగా, రసహీనంగా మారిపోయిందోనని ఆలోచించిన నాకు ఇలా చెప్పాలని అనిపించింది...సారీ...చాలా పెద్ద ఉపన్యాసమే దంచాను..'' నవ్వుతూ అన్నాడు సుందర్. ''ఛ...ఛ..అదేంలేదు. ఒక శ్రేయోభిలాషిలా నా తప్పేంటో నాకు తెలిసేలా చేశావు. అందుకు నేనే నీకు థ్యాంక్స్ చెప్పాలి. ఇంకెప్పుడు నా 'మోహన'ను కలత చెందనివ్వను'' దృఢంగా చెప్పాడు శ్రీకాంత్.

శ్రీకాంత్ తలపులనిండా మోహనే.

మోహనకి అన్ని సౌకర్యాలు కలగజేస్తున్నాడనే అనుకుంటున్నాడు తనిన్నాళ్ళు. ఏ విధమైన దురలవాట్లు లేవని, తద్వారా ఆమె సుఖపడుతుందనీ భ్రమించాడు. కానీ సర్వకాల సర్వావస్థలయందు మోహన తన సాన్నిధ్యాన్ని ఆశిస్తోందని తెలుసుకోలేకపోయాడు. తన పొరపాటే తామిద్దరి మధ్యనా, కొన్ని యోజనాల దూరం పెంచేసిందని ఇప్పటికి అర్థమైంది. ఆలుమగల నడుమ ఏర్పడే 'కమ్యూనికేషన్ గ్యాప్' ఎన్ని అనర్థాలకు మూలహేతువు అవుతుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు.

ఒక్కసారిగా శ్రీకాంత్ మది మోహన పట్ల అనురాగంతో నిండిపోయింది.

అతనికి ఎంత త్వరగా ఇంటికెళదామా, పశ్చాత్తాపంతో మోహన గుండెల్లో ముఖం దాచుకుని ఎంత వేగంగా ఊరట చెందుదామా అని ఆతృతగా ఉంది. ఆఫీస్‌కి హాఫ్‌డే లీవ్ పడేశాడు. బజారుకెళ్ళి పూలు, స్వీట్స్, మోహనకి మంచి చీర, పిల్లలకి బొమ్మలు తీసుకున్నాడు. లేత గులాబీరంగు చీరలో మోహనను ఊహించుకుంటే ముద్దులొలికే గులాబీ బాలలా దర్శనమిస్తోంది.

నాలుగింటికే ఇంటికొచ్చిన శ్రీకాంత్‌ని చూసి ఆశ్చర్యపోయింది మోహన. ఆమె కలువకన్నులలో కదలాడిన సంభ్రమాన్ని చూసి చిన్నగా నవ్వాడు శ్రీకాంత్. పిల్లలిద్దరూ ''నాన్నగారూ'' అంటూ చుట్టుకుపోయారతన్ని.

''పిల్లలిద్దర్నీ త్వరగా రెడీచేసి, నువ్వూ తయారవ్వు..ఎగ్జిబిషన్‌కి వెళ్దాం'' తను తెచ్చినవన్నీ మోహనకి అందిస్తూ చెప్పాడు శ్రీకాంత్.

''హే...నాన్నగారు ఎగ్జిబిషన్‌కి తీసుకెళ్తారూ..'' అంటూ కేరింతలు కొట్టారు పిల్లలు. చిరుగంటల మోతలా ఆహ్లాదంగా వినిపించాయా నవ్వులు వీనులవిందుగా.

నమ్మలేనట్లుగా చూసింది మోహన. కళ్ళతోనే అది నిజమని తెలియచెప్పాడు శ్రీకాంత్.

అందరూ తయారై ఎగ్జిబిషన్‌కి వెళ్ళారు. పిల్లలకి అన్ని సరదాలు తీర్చాడు శ్రీకాంత్. జెయింట్ వీల్‌లో ఎక్కారందరూ. అతన్ని కరుచుకుని కూర్చున్నారు మోహన, రోహిత్, రమ్యలు. తన రెక్కల క్రింద గువ్వపిట్టల్లా ఒదిగిపోయిన భార్యాబిడ్డల స్పర్శ అతనిలో వింత సంతృప్తిని కలుగజేసింది.

తను ఎంతటి ఆనందాన్ని మిస్ అయ్యాడూ! చాలా రోజుల తరువాత మోహన వదనంలో ఎనలేని సంతోషం, మైమరిపించే మెరుపుల కలగలుపును చూశాడు. ఆమె పగడాల పెదవుల మీద చంద్రవంకలా వెలిగిన దరహాసం అతని గుండెల్ని సుతారంగా మీటింది.

భార్యంటే పడకటింటి యంత్రం కాదని, మనసున్న మనిషని కాస్త ఆలస్యంగానే అర్థమైందతనికి.

ఇంటికొస్తూ హోటల్‌లో భోజనం చేశారు.

మోహన మిగిలిన పనులు పూర్తిచేసుకుని తయారై వచ్చేసరికి పిల్లలకి కథలు చెప్పి నిద్రపుచ్చాడతను.

తెల్లనిచీరలో, తలనిండా జాజులతో గదిలోకి వచ్చింది మోహన. వస్తూ...వస్తూ తన చేతి వేళ్ళన్నింటికి తమలపాకుల చిలుకలు పెట్టుకుని మరీ వచ్చింది. సిగ్గుపడుతూనే అతని నోటికి చిలకలందించింది. చిలకలతోపాటు ఆమె వ్రేలి కొసను కూడా మునిపంటితో కొరికాడు శ్రీకాంత్.

''ష్ అబ్బా!'' సున్నితమైన నొప్పిని అభినయించింది మోహన. పకపకనవ్వాడు శ్రీకాంత్.

చిరుకోపంగా చూసిందతనివైపు. ఆమె చూపులు మన్మథబాణాలై నాటుకున్నాయి అతని హృదయాన. రతీదేవిలా కవ్విస్తున్న మోహనను ముద్దుల్లో ముంచెత్తుతూ ''అయామ్ సో సారీ మైలవ్! ఇంకెప్పుడూ నిన్ను బాధపెట్టను. ఒకవేళ బాధిస్తే తీయగా శిక్షించి నీ కక్ష తీర్చుకో...'' చెప్పాడతను తమకంలో హత్తుకుపోతూ.

సమాధానంగా తామరతూడుల్లాంటి తన బాహుయుగళిని అతని వీపు చుట్టూ పెనవేసి అల్లుకుపోయింది మోహన ఆత్రంగా.

చాలారోజుల ఎడబాటు ఆవిరవ్వగా...మనస్ఫూర్తిగా తనను తాను అర్పించుకుంది మోహన. ☆

